సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం | 29 | జూలై | 2023



చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21 వేలు పలికాయి. మార్కెట్‌కు 481 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.133

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.133 పలికింది. కనిష్టం, రూ.100, సరాసరి రూ.120 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.6°/21.2°

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైనా ఎక్కడా వర్షపాతం నమోదు కాలేదు.

న్యూస్‌రీల్

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలల పురస్కారాలు–2024కు అర్హులైన నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. 18 ఏళ్ల లోపు వయస్సు గల బాలబాలికలు అర్హులన్నారు. క్రీడలు, సామాజిక సేవా రంగం, ధైర్య సాహసాలు, నూతన ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక, సంప్రదాయ, శాస్త్ర సాంకేతిక తదితర రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారు ఆగస్టు 31లోగా https//awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తిరుపతి - షోలాపూర్ మధ్య వీక్లీ ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తిరుపతి – షోలాపూర్ మధ్య వారాంతపు (వీక్లీ) ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఛీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అగస్టు 3న (గురువారం) రాత్రి 9.40 గంటలకు షోలాపూర్ జంక్షన్‌లో వీక్లీ రైలు (01437) బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7.45 గంటలకు తిరుపతి జంక్షన్‌కు చేరుతుందన్నారు. తిరిగి ఈ రైలు (01438) శుక్రవారం రాత్రి 9.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7.10 గంటలకు షోలాపూర్ చేరుతుందన్నారు. ఈ రైలు రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు జంక్షన్, ఆదోని, మంత్రాలయం, రాయచూర్, యాదగిరి, వాడీ జంక్షన్, కలబుర్గి, హుమ్నాబాద్, బీదర్, బాల్కి, ఉద్గీర్, లాతూర్ రోడ్డు, లాతూర్ మీదుగా షోలాపూర్‌కు చేరుతుందని వివరించారు.

సేవలతోనే ప్రజల్లో గుర్తింపు

- ఎస్పీ మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: మెరుగైన సేవలతోనే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ఈ మేరకు పోలీసులు సేవలందించాలన్నారు. నిత్యం ఒత్తిడితో కలిగిన విధులు నిర్వర్తించే పోలీసులకు గ్రౌండ్ ప్రాక్టీస్ చాలా ముఖ్యమన్నారు. అప్పుడే ఫిట్‌గా ఉంటూ విధి నిర్వహణలో ఉత్తమ ఫలితాలు సాధించగలమన్నారు. శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్), స్పెషల్ పార్టీ పోలీసులు, హోం గార్డులు, పుట్టపర్తి అర్బన్, రూరల్ స్టేషన్ల పోలీస్ సిబ్బంది పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ...పరేడ్‌తో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అందువల్లే నెలకు రెండుసార్లు పరేడ్ నిర్వహిస్తున్నామని, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూతన జిల్లాలో వనరులు తక్కువగా ఉన్నా... విధులు చక్కగా నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఏదైనా సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐలు శ్రీశైలంరెడ్డి, టైటస్, నారాయణతోపాటు హోంగార్డులు, స్పెషల్‌పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

నగ.. ధగ ధగ



శుభకార్యం ఏదైనా... మహిళలు ప్రత్యేకంగా దృష్టి సారించేది ఆభరణాలపైనే. చీర రంగు, డిజైన్‌కు తగ్గట్టుగా ఆభరణాలు ధరించాలనుకుంటారు. అందరిలోనూ ప్రత్యేకంగా కనిపించాలని కోరుకుంటారు. కానీ బంగారం ధరలు చుక్కలనంటుతుండంతో ప్రత్యామ్నాయ ఆభరణాల వైపు చూస్తున్నారు. చాలా మంది 'వన్‌గ్రామ్ గోల్డ్' వైపు మొగ్గుచూపుతున్నారు. ధర తక్కువగా ఉండటం...వివిధ మోడళ్లలో అందుబాటులో ఉండటంతో ఎక్కువ మంది వీటిని ధరించేందుకు ఇష్టపడుతున్నారు. రోజుకో మోడల్ నగతో ధగధగ మెరుస్తున్నారు.

వన్‌గ్రామ్ గోల్డ్... ఫుల్ డిమాండ్

- ధర తక్కువ, ఆధునిక డిజైన్లు
- మోడ్రన్ లుక్ కోసం భారీగా కొంటున్న యువతులు
- చోరీల నేపథ్యంలో రోజువారీగా ధరించేందుకు మహిళల మొగ్గు
- హిందూపురం, ధర్మవరంలో పెరిగిన విక్రయాలు



సాక్షి, పుట్టపర్తి: బంగారం.. కొనాలంటే ధర భయపెడుతోంది...ఎలాగోలా కొందామనుకున్నా కావాల్సిన మోడల్ అందుబాటులో ఉండటం లేదు. నచ్చిన మోడల్ నగ కొనుగోలు చేసినా నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి. అందువల్లే బంగారు ఆభరణాల కొనుగోలు ఇప్పుడో పెద్ద ప్రహసనం. అందువల్లే సామాన్య, మధ్యతరగతి వారు ప్రత్యామ్నాయ ఆభరణాల వైపు మొగ్గు చూపుతున్నారు.

జిగేల్ మంటున్న వన్‌గ్రామ్ గోల్డ్

బంగారు ఆభరణాలు కొనుగోలు చేయలేని సామాన్యులు, మధ్య తరగతి మహిళలకు ఇప్పుడు వన్‌గ్రామ్ గోల్డ్ కళ్లముందు జిగేల్‌మంటోంది. ధరలు కూడా అందుబాటులో ఉండటం..కోరిన డిజైన్లలో దొరుకుతుండటంతో వన్‌గ్రామ్ గోల్డ్‌కే జై కొడుతున్నారు. చైన్ స్నాచింగ్ కేసులు నేపథ్యంలో చాలా మంది తాళిబొట్టు గొలుసు కూడా వన్‌గ్రామ్ గోల్డ్‌నే వాడుతున్నారు. వీటిని ధరించడం సులువు, రవాణాలో ఇబ్బంది ఉండదు, పైగా చోరీకి గురైనా నష్టం పెద్దగా ఉండదు. దీనికి తోడు రకరకాల డిజైన్లు ఆకట్టుకుంటాయి. తక్కువ మొత్తానికే భారీ తూకం నగలు ఇంటికి చేరుతాయి. అందువల్లే చాలా మంది వన్‌గ్రామ్ గోల్డ్ బెస్ట్ అంటుండగా... జిల్లాలో దుకాణాలు భారీగా వెలిశాయి. గతంలో బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రముఖ నగరాల్లోనే ఎక్కువగా కనిపించే వన్‌గ్రామ్ గోల్డ్ నగల దుకాణాలు ఇప్పుడు హిందూపురం, ధర్మవరం తదితర పట్టణాల్లోనూ మిరుమిట్లు గొలుపుతున్నాయి.

సంపన్నులదీ అదే దారి

ప్రస్తుతం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.55 వేలపైనే పలుకుతుండగా... ఏ ఆభరణం కొనాలన్నా రూ.లక్షలు వెచ్చించాల్సిన పరిస్థితి. కొనుగోలు చేసిన వారు కూడా చోరుల భయంతో ధరించలేని దుస్థితి. అందువల్లే ఇంట్లో బంగారం ఎక్కువ ఉన్న వాళ్లు బ్యాంకుల్లోని లాకర్లలో ఉంచుతున్నారు. శుభకార్యాల సమయంలో వాటిని తీసుకుని ధరిస్తున్నారు. ఆ వెంటనే మళ్లీ లాకర్లలోనే భద్రపరుస్తున్నారు. ఇదంతా ఎందుకు అనుకునే సంపన్నులు వన్‌గ్రామ్ గోల్డ్ నగలను ధరించేందుకు ఇష్ట పడుతున్నారు. బంగారం కొనుగోలు కోసం దాచిన డబ్బును వివిధ రంగాల్లో పెట్టుబడి పెడుతున్నారు.



హిందూపురంలోని దుకాణంలో వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలు

డిమాండ్‌కు అనుగుణంగా డిజైన్లు

బంగారు ఆభరణాలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఉండే వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు వివిధ డిజైన్లలో అందుబాటులో ఉంటున్నాయి. ఉంగరాల ధర రూ.వెయ్యి నుంచి రూ.10 వేల వరకు ఉంటోంది. మహిళలు ధరించే లాంగ్ చైన్లు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు రకరకాల డిజైన్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో మధ్య తరగతి వారంతా విపరీతంగా కొనుగోలు చేస్తున్నారు. అందులోనూ కళాశాలలకు వెళ్లే యువతులు రెండు, మూడు సెట్ల నగలు కొంటున్నారు. ఫలితంగా అమ్మకాలు బాగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

వ్యాపారం బాగుంది



వన్‌గ్రామ్ గోల్డ్‌తో చేసిన ఆభరణాలకు నాలుగైదు ఏళ్లుగా విపరీతమైన డిమాండ్ పెరిగింది. పట్టణ వాసులకు పోటీగా పల్లె వాసులు కొనుగోలు చేస్తున్నారు. ధరల విషయంలో రాజీ పడకుండా నచ్చి.. మెచ్చిన డిజైన్లను సొంతం చేసుకుంటున్నారు. రోజూ కనీసం ఐదుగురు చొప్పున వన్ గ్రామ్ గోల్డ్‌తో చేసిన బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారు.

– సాజిద్, బంగారు నగల వ్యాపారి, ధర్మవరం

కాలేజీ విద్యార్థులే ఎక్కువ



కరోనా లాక్‌డౌన్ తర్వాత వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలకు డిమాండ్ పెరిగింది. గ్రామీణ ప్రాంత వాసులు విపరీతంగా కొనుగోలు చేస్తున్నారు. అందులో కూడా కాలేజీ విద్యార్థినులే అధికంగా ఉంటున్నారు. దొంగల బారి నుంచి నష్టపోకుండా ఉండేందుకు విరివిగా వినియోగిస్తున్నట్లు చెబుతున్నారు.

– రమేశ్, వ్యాపారి, హిందూపురం

బస్సు డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న డీపీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: వర్షాకాలంలో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించి బస్సులు నడపాలని ప్రజారవాణా అధికారి మధుసూదన్ సూచించారు. శుక్రవారం ఆయన ఆర్ఎం కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. డ్రైవర్లు పాటించాల్సిన నియమ నిబంధనలు వివరించారు. వంతెనలపై నీటి ప్రవాహం ఉన్నప్పుడు ప్రవాహ వేగం తగ్గిన తర్వాతే బస్సు నడపాలన్నారు. బస్సును నడిపేటప్పుడు పొగ తాగరాదని తెలిపారు. సెల్ ఫోన్‌లో మాట్లాడటం, ఒంటి చేత్తో డ్రైవింగ్ చేయరాదన్నారు. అనంతరం డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో రూపొందించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనాయతుల్లా, సిబ్బంది పార్థసారథిరెడ్డి, షాషావలి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

- ముగిసిన స్వర్ణలత అంత్యక్రియలు

తనకల్లు: ప్రేమ పేరిట వేధింపులను తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న స్వర్ణలత అంత్యక్రియలు శుక్రవారం గుంజువారిపల్లిలో ముగిశాయి. ఉదయమే కదిరి ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేయించిన అధికారులు అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. దీంతో స్వగ్రామం తీసుకువెళ్లారు. సలీం, నవీన్ అనే ఇద్దరు యువకులు ప్రేమ పేరుతో వేధించడంతోనే తన కుమార్తె బలవన్మరణానికి పాల్పడినట్లు స్వర్ణలత తండ్రి దొడ్డెప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న తనకల్లు పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.


డీఎస్పీ విచారణ

మరోవైపు స్వర్ణలత మృతిపై కదిరి డీఎస్పీ శ్రీలత శుక్రవారం గుంజువారిపల్లిలో విచారణ చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలను బంధువులు, గ్రామస్తులతో ఆరా తీశారు. తప్పక న్యాయం జరిగేలా చూస్తామని బాధిత కుటుంబానికి ఆమె హామీ ఇచ్చారు. డీఎస్పీ వెంట కదిరి రూరల్ సీఐ శంకర నాయక్, ఎస్ఐ రాంభూపాల్ ఉన్నారు.

గలగలా తుంగభద్ర జలాలు



డ్యాం వద్ద స్విచ్ బోర్డుకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న తుంగభద్ర బోర్డు సెక్రటరీ నాగమోహన్, ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి, ఈఈ రవిచంద్ర



హెచ్చెల్సీలో పారుతున్న జలాలు

- హెచ్చెల్సీకి నీరు విడుదల
- వాయనం సమర్పించిన బోర్డు అధికారులు

బొమ్మనహాళ్/ అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం నుంచి ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు శుక్రవారం నీరు విడుదలైంది. తొలుత తుంగభద్ర బోర్డు సెక్రటరీ జి.నాగమోహన్, ఎస్ఈ శ్రీకాంత్ రెడ్డి, హెచ్చెల్సీ ఈఈ రవిచంద్ర, ఎల్ఎల్‌సీ ఈఈ నీలికాంతరెడ్డి డ్యాంపై పూజలు చేసిన తర్వాత స్విచ్ ఆన్ చేసి హెచ్చెల్సీతో పాటు ఎల్ఎల్‌సీకి నీటిని విడుదల చేశారు. అనంతరం సంప్రదాయబద్ధంగా వాయనం వదిలారు. బోర్డు సెక్రటరీ నాగమోహన్ మాట్లాడుతూ తుంగభద్ర ఎగువ కాలువకు తొలిత 100 క్యూసెక్కుల నీరు వదిలి.. ప్రతి రెండు గంటలకు ఒకసారి క్యూసెక్కులు పెంచుతామని తెలిపారు. తొలిరోజు హెచ్చెల్సీకి 500 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు వెల్లడించారు. ఆంధ్ర, కర్ణాటక కోటా రెండూ కలిపి కాలువకు నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఎల్ఎల్‌సీకి కూడా 100 క్యూసెక్కులు నీరు వదిలి.. ప్రతి రెండు గంటలకు ఒకసారి క్యూసెక్కులు పెంచుతామన్నారు. శనివారం సాయంత్రం ఆరు గంటకల్లా ఆంధ్ర సరిహద్దులోని బొమ్మనహాళ్ మండలంలో 105వ కిలోమీటర్ వద్దకు తుంగభద్ర జలాలు చేరుతాయని అధికారులు తెలిపారు. పూజా కార్యక్రమంలో డీఈలు జగదీష్, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరద

తుంగభద్ర జలాశయానికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. శుక్రవారం ఉదయానికి 1,07,118 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. 1,633 అడుగుల నీటిమట్టానికి గాను 1,619 అడుగులకు చేరి, 60.001 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు.

ఐఏబీ సమావేశం తర్వాతే ఆయకట్టుకు..

తుంగభద్ర జలాశయంలో ప్రస్తుతం 60 టీఎంసీలు నీటి నిల్వ ఉంది. దామాషా ప్రకారం హెచ్చెల్సీకి 26.828 టీఎంసీలు వస్తాయని అధికారులు తెలిపారు. జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటిని విడుదల చేసిన నేపథ్యంలో నీటి కేటాయింపులు ఎలా ఉండాలనే విషయంపై సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించనున్నట్లు హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. కలెక్టర్, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు ఆయకట్టుకు ఎప్పటి నుంచి నీటిని విడుదల చేయాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటారన్నారు. తొలుత హైలెవల్ మెయిన్ కెనాల్, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌కు వదిలి.. పీఏబీఆర్, ఎంపీఆర్‌లో నీటి నిల్వ అనంతరం ఎంపీ సౌత్, నార్త్ ఇతరత్ర ఉపకాల్వలకు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కాలువ బలోపేతంపైనే దృష్టి పెట్టినట్లు తెలిపారు.

జలకళ బోర్లు వెంటనే వేయాలి

- పంటల సాగులో సలహాలు, సూచనలు ఇవ్వాలి
- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఛైర్మన్ అవుటాల



మాట్లాడుతున్న అవుటాల రమణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: జలకళ పథకంలో దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ వెంటనే బోర్లు వేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్సు హాలులో శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ చేతన్, ఏడీసీసీ బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవుటాల రమణారెడ్డి మాట్లాడుతూ.. రైతులకు సాగులో అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. సాంకేతికతలపై రైతులకు శిక్షణ ఇవ్వాలన్నారు. సాగు ఖర్చులు తగ్గించి దిగుబడి పెరిగే పంటలను సూచించాలన్నారు. అలాగే జిల్లాలో మల్బరీ సాగు విస్తీర్ణం పెంచేలా చూడాలన్నారు. ఇందుకోసం ప్రతి మండలంలోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మామిడి పంటపై యాజమాన్య పద్ధతులపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించాలన్నారు. ఎరువులు, మందుల షాపులపై తనిఖీలు నిర్వహించి నకిలీ మందులను సీజ్ చేయాలన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల శాఖల అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలన్నారు. తాజా వర్షాలతో ఖరీఫ్ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలనారు. ప్రత్యామ్నాయ సాగుకు అవసరమైన విత్తనాలు సిద్ధంగా ఉంచాలన్నారు.

ఈ–క్రాప్ బుకింగ్ పక్కాగా చేయాలి

జాయింట్ కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ...ఈ–క్రాప్ బుకింగ్ పక్కాగా చేపట్టాలని, ఆర్‌బీకేల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఏపీఎంఐపీ పరిధిలో దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే డ్రిప్ పరికరాలు అందజేయాలన్నారు. ప్రత్యామ్నాయ పంటగా రాగిని సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సుభదాస్, సెరికల్చర్ జేడీ పద్మమ్మ, మార్కెటింగ్ అధికారి నరసింహమూర్తి, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డ్వామా పీడీ రామాంజనేయులు, పౌరసరఫరాల శాఖ డీఎం అశ్వర్థనారాయణ నాయక్, డాట్ సెంటర్ కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, ఏపీఎస్‌పీ డీసీఎల్ డీఈఈ మోసెస్, ఏపీ సీడ్స్ డీఎం ధనలక్ష్మి, మార్క్‌ఫెడ్ డీఎం గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.



బత్తలపల్లిలో పూజలు నిర్వహిస్తున్న ముజావర్లు



పోట్లమర్రిలో గుండం వద్ద అలావ్ తొక్కుతున్న మహిళలు

సరిగెత్తు.. అలావ్ తొక్కు

బత్తలపల్లి: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ముజావర్లు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వాములకు చక్కెర, పానకం చదివింపులు చేశారు. మహిళలు, పిల్లలు అన్న తేడా లేకుండా అందరూ గుండం చుట్టూ తిరుగుతూ అలావు తొక్కుతూ కేరింతలు కొట్టారు. ఇక మొహర్రం వేడుకలకు ప్రసిద్ధిగాంచిన బత్తలపల్లిలో శుక్రవారం పీర్లమకాన్ వద్ద పెద్ద సరిగెత్తు వేడుకలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. బత్తలపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు పానకం దుత్తలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివార్లను సమర్పించారు. శనివారం ఉదయం 9 గంటలకు బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో వివిధ గ్రామాలకు చెందిన పీర్లు భేటీ అవుతాయి. ఈ కార్యక్రమంతో ఉత్సవాలు ముగియనున్నాయి.





గూగూడు కుళ్లాయి స్వామి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) దర్శనమిస్తున్న పీర్లు

భక్తజన సంద్రం

నార్పల: గూగూడు బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టం ఆరంభమైంది. శుక్రవారం పెద్ద సరిగెత్తు అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనం కుళ్లాయిస్వామి పీరును దర్శించుకుని తరించారు. ఫకీర్లు పానకాలు సమర్పించగా.. భక్తులు పొర్లుదండాలు పెడుతూ, చక్కెర చదివింపులతో మొక్కులు తీర్చుకున్నారు. శనివారం అగ్నిగుండ ప్రవేశం, సాయంత్రం జలధి ఉత్సవం జరుగుతుంది.

క్లుప్తంగా

పీఎంశ్రీకి టేకులోడు గురుకుల పాఠశాల ఎంపిక

చిలమత్తూరు: మండలంలోని టేకులోడు క్రాస్‌లో ఉన్న మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల పీఎంశ్రీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్యామ్‌భూపాల్‌రెడ్డి తెలిపారు. పీఎంశ్రీకి తమ పాఠశాల ఎంపిక కావడంతో ఇకపై మరింత మెరుగ్గా భోదన అందించే అవకాశం లభించిందన్నారు.

ప్రమాదవశాత్తూ కిందపడి వ్యక్తి మృతి


మృతుడు రాజు

రొద్దం: మండల పరిధిలోని ఆర్ కొట్టాల గ్రామంలో ఓ ఇంట్లో విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా కాలుజారి కిందపడి ఆర్ మరువపల్లి ఎస్సీ కాలనీకి చెందిన రాజు(40) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... ఆర్ కొట్టాల గ్రామంలో ఓ ఇంట్లో కరెంటు పనిచేస్తుండగా రాజు ఇనుప నిచ్చెన మీద నుంచి కింద పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


నీటిలో తేలియాడుతున్న మృతదేహం

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని వెస్టనడిమిపల్లి పంచాయతీ దేవరపల్లి సమీపంలోని నారపచెరువులో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల వివరాల మేరకు... నారపచెరువు నీటిలో తేలియాడుతూ కనిపించిన మృతదేహాన్ని గమనించిన పశువుల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జ్ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సిబ్బందితో ఘటనా స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. సుమారు 40 నుండి 50 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తిగా గుర్తించి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఆస్పత్రికి తరలించారు. వారం రోజుల క్రితం అన్నమయ్య జిల్లా రాయచోటి సమీపంలోని పాత రామాపురం గ్రామానికి చెందిన పలువురు నన్నారి గడ్డలు కోయడానికి వచ్చివెళ్లారని, వారికి సంబంధించిన వ్యక్తి అయ్యి ఉండవచ్చునని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ తెలిపారు.

జోరువాక

జిల్లాలో పంటల సాగు ఇలా..

సాధారణ సాగు	3.23 లక్షల హెక్టార్లు
ప్రస్తుతం సాగైంది	78 వేల హెక్టార్లు
జిల్లాలో ఉన్న బోరు బావులు	65,753
సాగు భూమి	1.03 లక్షల హెక్టార్లు
ప్రభుత్వ సాయం	రూ. 651.02 కోట్లు

సాగు చేసిన పంటలు – వేరుశనగ, కంది, మొక్కజొన్న, వరి, పొద్దు తిరుగుడు, ఆముదం, రాగి, కొర్ర,.పెసర, పత్తి, మిరప, టమాటతదితర పంటలు

- వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- పంటల సాగులో అన్నదాతల నిమగ్నం
- రెండు రోజుల్లోనే 18 వేల హెక్టార్లలో పంటలు
- సబ్సిడీ విత్తనాల పంపిణీతో పాటు అన్ని విధాలా ప్రభుత్వ సాయం


కప్పలబండ వద్ద వరి సాగుకు సిద్ధం చేస్తున్న రైతు

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కర్షకులు పొలం బాట పట్టారు. ఇప్పటికే పంటల సాగుకు ఉపయోగ పడేవిధంగా పలు పథకాలతో ప్రభుత్వం సాయం అందించింది. సబ్సిడీ విత్తనాల పంపిణీ కూడా పూర్తవడంతో ఏ ఇబ్బంది లేకుండా పంటలు సాగుచేస్తున్నారు.

సబ్సిడీతో విత్తనాలు

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం రైతులకు అందజేసే సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ పూర్తి చేశారు. జిల్లాలో సాధారణంగా 3.23 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేయనుండగా వారికి అవసరమైన వేరుశనగ సుమారు 95,772 క్వింటాళ్లు అందజేశారు. దీంతో పాటు 400 కిలోల రాగులు , 10.5 క్వింటాళ్ల కందులు పంపిణీ చేశారు. రైతులకు ఏ ఇబ్బంది లేకుండా రైతు భరోసా కేంద్రాల్లోనే విత్తనాలు అందించారు.

ప్రత్యామ్నాయ విత్తనాలు కూడా...

వర్షాలు కాస్తా ఆలస్యంగా కురవడంతో రైతులు వేరుశనగ సాగు చేయకుండా ప్రత్యామ్నాయ విత్తనాలు అడిగితే ఇవ్వడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇందులో భాగంగానే వ్యవసాయాధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆగష్టు 15 నాటికి ప్రత్యామ్నాయ విత్తనాలు అందుబాటులో ఉంచనున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

రైతుకు అండగా ప్రభుత్వం

ఖరీఫ్ పంటల సాగులో రైతులు ఇబ్బంది పడకూడదని ఇప్పటికే వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ , వాతావరణ బీమా, పంటల దిగుబడి ఆధారంగా ఇచ్చే బీమా, వంటి పథకాల కింద ప్రభుత్వం జిల్లా రైతులకు సుమారు రూ.651.02 కోట్లు అందజేసింది. రైతు భరోసా కింద 2.75 లక్షల మంది రైతులకు రూ.206.49 కోట్లు, సబ్సిడీ విత్తనాలకు రూ.18 కోట్లు, వాతావరణ బీమా, పంటల దిగుబడి ఆధారంగా ఇచ్చే బీమా రూ.157.35 కోట్లు, పీఎం కిసాన్ సాయం రూ.58.40 కోట్లు దిచ్చారు. వీటితో పాటు 416 ట్రాక్టర్లు, వందలాదిగా వ్యవసాయ పరికరాలు అందజేసింది. ఇందుకు సబ్సిడీ కింద రూ.10.78 కోట్లు అందజేసింది.

రెండు రోజుల్లో 18 వేల హెక్టార్లు

జిల్లాలో వ్యవసాయ బోరు బావుల కింద ఇప్పటికే రైతులు 21 వేల హెక్టార్లలో పంటలు సాగు చేశారు. మెట్ట భూముల్లో 2.20 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి వస్తుందని అంచనా. అయితే ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 60,270 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. రెండు రోజుల నుంచి సుమారు 18 వేల హెక్టార్లలో సాగు చేసి ఉంటారని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. జిల్లాలో సాధారణంగా జూన్ నెలలో సాధారణ వర్షపాతం 66.6 మి.మీ, జూలైలో 70.9 మి.మీ కురవాల్సి ఉంది. అయితే జూన్‌లో -15 శాతం , జూలైలో -25 శాతం వర్షం కురిసింది.

అన్ని విధాలా అండగా ఉన్నారు



ఇప్పటికే నేను 3 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాను. ప్రస్తుతం కురిస్తున్న వర్షాలు పంటకు ఎంతో ఉపయోగం . పంట బాగా కళకళ లాడుతోంది. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు అందజేసింది. ఎరువులు కూడా సరఫరా చేసింది. పంట పెట్టుబడికి డబ్బు ఇచ్చింది ఇంతకంటే రైతుకు ఇంకేం కావాలి? ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచింది.

– కృష్ణారెడ్డి, ఎనుములపల్లి

ప్రభుత్వ సహకారం బాగుంది



మూడేళ్ల నుంచి మంచి వర్షాలు కురుస్తుండడంతో భూగర్భజలాలు తగ్గలేదు. దీంతో బోర్లలో నీళ్లు సమృద్ధిగా వస్తున్నాయి. దీంతో ఈసారి మొక్కజొన్న, దానిమ్మ తోటను సాగు చేశాను. ప్రభుత్వ సహకారం బాగుంది. ఉద్యాన పంటలతో మంచి లాభాలు ఉన్నాయని అధికారులు చెప్పడంతో మొదటిసారి దానిమ్మ సాగు చేశాను.

– చంద్రశేఖర్, పైపల్లి:

రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు



ఈ ఏడాది కొంత ఆలస్యంగా వర్షాలు కురవడంతో పంటల సాగు కొంత ఆలస్యమైంది. అయితే భూగర్భజలాలు సమృద్ధిగా ఉండడంతో బోర్ల కింద సాగు పూర్తయింది. వేరుశనగ సాగు చేయలేని రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలకు ప్రభుత్వానికి నివేదిక పంపాము. రాగానే ప్రత్యామ్నాయ విత్తనాలైన ఉలవ, పెసర, అలసంద, జొన్నలు అందిస్తాం. రైతులు ఇబ్బంది పడకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నాం.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

'స్మార్ట్'గా కాపీయింగ్

- విద్యార్థిని డీబార్ చేసిన అధికారులు


పట్టుబడిన స్మార్ట్ వాచీ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డిగ్రీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే శుక్రవారం అనంతపురం నగరంలోని ఎస్ఎల్ఎన్ కాలేజీలో జరిగిన పరీక్షల్లో పీవీకేకే డిగ్రీ కాలేజీకి చెందిన సాకే దివ్య తేజ (బీకాం కంప్యూటర్స్) స్మార్ట్ వాచీ సాయంతో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడ్డాడు. తొలుత వర్సిటీ ఉన్నతాధికారులు డిజిటల్ వాచీ అని పెద్దగా పట్టించుకోలేదు. అక్కడే ఉండి తీక్షణంగా పరిశీలించడంతో స్మార్ట్‌వాచీ సాయంతో జవాబులు చూస్తూ రాస్తున్నట్లు గుర్తించారు. సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అనే సబ్జెక్టు కావడంతో వాటికి సంబంధించిన వివరాలు స్మార్ట్ వాచీలో ఉన్నాయి. వెంటనే స్మార్ట్‌వాచీని స్వాధీనం చేసుకుని విద్యార్థిని డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ తెలిపారు. డిగ్రీ రెగ్యులర్ పరీక్షల్లో స్మార్ట్, డిజిటల్ వాచీలు, ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలు తీసుకరావడం నిషేధం అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో డీబార్ చేశామన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి


మృతురాలు పద్మావతి

మడకశిర: పట్టణంలోని మధుగిరి సర్కిల్‌లో ఓ పాత భవనంలో ఈ నెల 21న అనంతపురం పట్టణానికి చెందిన తిప్పేస్వామి, పద్మావతి అనే ప్రేమికులు విషం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ప్రియుడు తిప్పేస్వామి అక్కడికక్కడే మృతి చెందగా.. ప్రియురాలు పద్మావతి పరిస్థితి విషమంగా ఉండటంతో మడకశిర ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం హిందూపురం, ఆ తర్వాత అనంతపురం ఆస్పత్రిలో చేర్పించి వైద్య సేవలందించారు. అయితే శుక్రవారం చికిత్స పొందుతూ పద్మావతి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రాయలచెరువులో భారీ దొంగతనం

- 15 తులాల బంగారు, 3 కేజీల వెండి చోరీ

యాడికి: మండల పరిధిలోని రాయలచెరువులో భారీ దొంగతనం జరిగింది. 15 తులాల బంగారం , దాదాపు మూడు కేజీల వెండి అపహరణకు గురైంది. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.... నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం చంద్రపల్లెకి చెందిన కమ్మర విశ్వరూప ఆచారి 20 ఏళ్ల క్రితం రాయలచెరువులో బస్టాండు సమీపంలో ఉన్న కాంప్లెక్స్‌లో నివసిస్తూ గణేష్ జ్యువెలరీ షాపును నిర్వహిస్తున్నారు. శుక్రవారం తన కుమార్తె పుట్టిన రోజును సొంతూరులో జరుపుకోవాలని గురువారం రాత్రి 10 గంటల వరకు బంగారు షాపులో ఉండి చంద్రపల్లెకు వెళ్లారు. ఇందులో భాగంగానే దుండగులు అర్ధరాత్రి షాపు షట్టర్ బీగాలు తొలగించి లోపలకు వెళ్లారు. సీసీ కెమెరాలతో పాటు చిన్న బీరువాలోని 15 తులాల బంగారు, దాదాపు 3 కేజీల వెండి దోచుకెళ్లారు. శుక్రవారం ఉదయం షాపుకు వచ్చిన విశ్వరూప ఆచారికి షట్టర్ బీగాలు తీసిఉంచడంతో లోపలికి వెళ్లి చూడగా దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శంకర్‌రెడ్డి, డీఎస్పీ సీఎం గంగయ్య, డాగ్‌స్క్వాడ్, వ్రేలి ముద్ర నిపుణులు వచ్చి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలి


చిన్న ఎల్లంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

నల్లచెరువు: ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే పాటించాని జిల్లా వైద్యాధికారి డా.కృష్ణారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చిన్న ఎల్లంపల్లిలో మండల వైద్యాధికారి అయినుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం కృష్ణారెడ్డి పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో కలిసి గ్రామంలో డెంగీపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. వైద్యసిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామస్తులు ఇంటి పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం ఇళ్లలో వేపాకు పొగ వేసుకోవాలని, నిద్రించే సమయంలో దోమ తెరలు తప్పనిసరిగా వాడాలన్నారు. వైద్యసిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులోఉంటూ ప్రజలకు ఆరోగ్య పరమైన సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, ఏఎంఓ లక్ష్మీనాయక్, మలేరియా సిబ్బంది రామాంజినేయులు, బాషా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ


సెరికల్చర్ కార్యాలయం వద్ద మొక్కనాటుతున్న జేడీ పద్మమ్మ, ఆవుటాల రమణారెడ్డి, తదితరులు


డీఆర్‌డీఏ వద్ద మొక్కలు నాటుతున్న పీడీ నరసయ్య, డీఎల్‌డీఓ శివారెడ్డి తదితరులు

పుట్టపర్తి అర్బన్: పర్యావరణ పరిరక్షణతో మానవ మనుగడ సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు. కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల వద్ద మొక్కలు నాటారు. కలెక్టరేట్ ఆవరణలో డీఆర్ఓ కొండయ్య, ఏఓ వెంకటనారాయణ, సెరికల్చర్ కార్యాలయం వద్ద రెండు ఎకరాల్లో మొక్కలు నాటారు. జేడీ పద్మమ్మ, అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, బీసీ సంక్షేమశాఖ డీడీ నిర్మలాజ్యోతి, డీఆర్‌డీఏ కార్యాలయం ఆవరణలో పీడీ నరసయ్య, జిల్లా నోడలాఫీసర్ శివారెడ్డి, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, ఏపీ నాగరాజు, మండల సమైఖ్య అధ్యక్షురాలు పుష్పాలత, తహసీల్దార్ కార్యాలయం వద్ద డీటీ నరసింహులు, సీఎస్‌డీటీ షబ్బం తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి విజయ్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ రఘునాథ గుప్తా ఆధ్వర్యంలో అధికారులు మొక్కలు నాటారు. విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని విజయ్‌కుమార్‌రెడ్డి సూచించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

హిందూపురం అర్బన్: హిందూపురం పట్టణంలోని ఎంజీఎం మైదానం సమీపంలో రైల్వే పట్టాల వద్ద శుక్రవారం రాత్రి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా.. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఆ యువకుడు అప్పలకుంటకు చెందిన వ్యక్తిగా చెబుతున్నారు. ప్రస్తుతం బాధితుడు హిందూపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. అతని చేతిపై మహేష్ అన్న పచ్చబొట్టు ఉందన్నారు.

మామపై అల్లుడు కత్తితో దాడి

కదిరి అర్బన్: తన భార్యను కాపురానికి పంపలేదని మామపై అల్లుడు కత్తితో దాడిచేసి గాయపరచిన సంఘటన శుక్రవారం రాత్రి కదిరి మండలం మిద్దెవారిపల్లిలో చోటు చేసుకుంది. అలీఫ్ గుల్ మిద్దెవారిపల్లిలో నివాసం ఉంటున్నారు. మస్తాన్ కదిరిలోని 18వ వార్డులో ఉంటున్నారు. అయితే అల్లుడు మస్తాన్ తాగుడుకుబానిసై తన కూతురిని సరిగా చూసుకోలేదని అలీఫ్‌గుల్ కుమార్తెను ముంబాయ్‌కి పంపించేశారు. అలీఫ్ గుల్ స్వస్థలం ముంబాయ్. తన భార్యను తన వద్దకు పంపించకుండా ముంబయ్‌కు పంపించేశాడని ఆగ్రహంతో అలీఫ్‌గుల్‌పై మస్తాన్ కత్తితో దాడి చేసిగాయపరిచాడు. బాధితున్ని చికిత్స నిమిత్తం కదిరి ఆస్పత్రికి తరలించారు.అలీఫ్ గుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మస్తాన్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ బాబ్జాన్ తెలిపారు.

రాష్ట్రంలో అగ్రగామిగా ఎస్కేయూ

- నాణ్యమైన పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా గుర్తింపు
- ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి
- అట్టహాసంగా ఎస్కేయూ 42వ ఆవిర్భావ దినోత్సవం


ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి మెమొంటో అందిస్తున్న ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

అనంతపురం: నాణ్యమైన పరిశోధనలు.. అత్యుత్తమ బోధన, అంకితభావంతో పనిచేసే ఉద్యోగులు.. సమాజోపయోగకరమైన ఆవిష్కరణలు అన్ని అంశాల్లోనూ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రాష్ట్రంలో అగ్రగామిగా ఉంది' అని వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. ఎస్కేయూ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం భువన విజయం ఆడిటోరియంలో అట్టహాసంగా నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ... గడిచిన మూడేళ్లలో విశేషమైన మైలురాయిని అధిగమించామన్నారు. అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తయారు చేస్తున్నామని తెలిపారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు సంబంధించిన ప్రాంతీయ వాతావరణ పరిశోధన స్థానంతో వర్సిటీ కీర్తి జాతీయ స్థాయిలో ఇనుమడింపజేశామన్నారు. బోటనీ విభాగంలో 40 వేల స్పెసిమెన్లు ఏర్పాటు చేసి సరికొత్త రికార్డును సృష్టించినట్లు వివరించారు. ఈ జాబితాలో దక్షిణ భారతదేశంలోనే రెండో వర్సిటీగా ఖ్యాతి దక్కిందన్నారు. నూతన జాతీయ విద్యావిధానం-2020ను పకడ్బందీగా అమలు చేస్తూ నైపుణ్యాధికారిత కోర్సులను ప్రవేశపెట్టామన్నారు. మూడు స్నాతకోత్సవాలను నిర్వహించిన ఘనత లభించిందన్నారు. రూ.5 కోట్ల విలువైన ఇండోర్ స్టేడియంను పూర్తి చేసి రెండు నెలల్లో విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామన్నారు. 86.76 ఎకరాల భూమిని రికవరీ చేసి వర్సిటీ ఆస్తిని పరిరక్షించామని పేర్కొన్నారు.

అంకితభావంతో కష్టపడాలి

విశిష్ట అతిథిగా హాజరైన యూపీఎస్సీ మాజీ సభ్యులు వై. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ... శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తనకు గౌరవ డాక్టరేట్ ప్రకటించిందన్నారు. అనంతరం జేఎన్‌టీయూ అనంతపురం తదితర వర్సిటీలు గౌరవ డాక్టరేట్ ఇచ్చినప్పటికీ తనలోని ప్రతిభను గుర్తించిన తొలి వర్సిటీ ఎస్కేయూ అని స్పష్టం చేశారు. ఎస్కేయూనివర్సిటీ ఎంతో పురోగతి సాధించిందన్నారు. ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వెంట్లను అందించిన ఘనత ఉందన్నారు. అంకితభావంతో కష్టపడితే ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో యోగివేమన వర్సిటీ వీసీ చింతా సుధాకర్ (ఎస్కేయూ పూర్వ విద్యార్థి), రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. కృష్ణకుమారి ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. క్రీడలు, వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

నాయకులుగా ఎదగాలి : ఎమ్మెల్యే తోపుదుర్తి

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ... రామకృష్ణారెడ్డి వీసీ అయిన తరువాత వర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పన జరిగిందన్నారు. రోడ్లు, భవనాలు ఈ మధ్యనే గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందని చెప్పారు. ఉన్నత స్థానంలో ఉన్న పూర్వ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాని సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది ఉస్మానియా యూనివర్సిటీ ఘనతేనన్నారు. బలహీనులకు , పుట్టిన ఊరు, ప్రాంతానికి దన్నుగా నిలవాల్సిన నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో రాజకీయ చైతన్యం కలగాలని, బాగా చదివి బాగా జీవితంలో రాణించాన్నారు. వర్సిటీలో అనేక కోర్సులు ఉన్నాయని, ఈ ప్రాంత వ్యవసాయాభివృద్ధికి దోహదపడే అగ్రికల్చర్ బీఎస్సీ, డెయిరీ సైన్సెస్ కోర్సులు వర్సిటీలో ఏర్పాటు చేయాలని వీసీని కోరారు. వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కాబట్టి వచ్చే ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి ఈ కోర్సులను సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభించాలని ఆశిస్తున్నానన్నారు. అగ్రికల్చర్ బీఎస్సీ అనంతపురంలో కేవలం ప్రైవేట్ కళాశాలల్లో ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఎస్కేయూనివర్సిటీలో ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ మధ్య కాలంలోనే వీసీ సహకారంతో వర్సిటీలో మెగా జాబ్‌మేళాను నిర్వహించి 1200 మందికి ఉద్యోగాలు కల్పించడం హర్షణీయమన్నారు. ఆర్.సీ.రెడ్డి స్టడీ సర్కిల్ వంటి కోచింగ్ సెంటర్ల సహకారంతో ఎస్కేయూ విద్యార్థులకు గ్రూప్స్‌కు కోచింగ్ ఇప్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున కృషి చేస్తామన్నారు. ఇందుకు గాను రూ.10 లక్షల విరాళంగా ప్రకటిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు.